# నన్ను క్షమించవూ !

చదివిన ఉత్తరం జేబులో పెట్టుకోబోతూ బయటకు తీసి మరొకసారి చదివాడు. "ప్రియమైన సత్యానికి అమ్మ దీవించి రాయునది. కృష్ణుడు చదవమంటే చదవటంలేదు. నేను చెప్పిన మాట వినిపించుకోవటం లేదు. నువ్వు వీలు చూసుకుని ఒకసారి వచ్చి వాడిని గట్టిగా మందలించి వెళ్తే బావుంటుందని అనుకుంటున్నాను. పాపక్షేమంగా ఉంది. మొన్న పరీక్షలలో మార్కులు బాగానే వచ్చాయి. నా దగ్గు ఇంకా తగ్గలేదు. ఆచారి ఇచ్చే మందు పనిచేస్తున్నట్టు లేదు. రామిరెడ్డి తనకివ్వాల్సిన డబ్బుల కోసం రభస చేస్తున్నాడు. నన్నేం చేయమంటావు?" అంత వరకు చదివి జేబులో పెట్టుకున్నాడు.

నాన్న బతికి ఉన్నప్పుడు ఎంత కష్టపడి తనను చదివించారో మర్చిపోలేదు. ఊరికి వెళ్లి రావాలంటే అనవసరమయిన ఖర్చు. కృష్ణుడికి చదువంటే ఆసక్తి లేదు. చెప్పీ చెప్పీ తనూ విసిగి పోయాడు. తను ఊరు వెళ్ళి వాడిని మందలించిన మాత్రాన దారిలోకి వస్తాడని నమ్మకం లేదు.

మధ్యాహ్నం భోజనం చేయలేదు. హోటలు కూపన్లు అయిపోయాయి. రెండుసార్లు మటుకు టీ తాగాడు. రెండురోజులు ఆగితే జీతం వస్తుంది. కూజాలోంచి గ్లాసులోని నీళ్లు వంపుకుని తాగాడు.

తలుపు తట్టిన చప్పుడయింది. ఇల్లుగలాయన అయి ఉంటాడు. పోయిన నెల గది అద్దె ఇంతవరకు ఇవ్వలేదు. ఇంటికి ఎక్కువ డబ్బులు పంపించేసరికి ఇక్కడ తక్కువయింది. అద్దె విషయంలో తనెప్పుడూ ఆలస్యం చేయలేదు. ఆయన డబ్బు దగ్గిర నిక్కచ్చిగా ఉంటాడు. తలుపు గడి తీశాడు.

ఎదురుగా నిర్మల నిలబడి ఉంది. ఆశ్చర్యపోయాడు. నిర్మల ఎన్నిసార్లు అడిగినా తను ఎక్కడ ఉంటున్నదీ చెప్పలేదు. ఎలా కనుక్కుందో ఏమో? "మీరా?" నవ్వుతూ అడిగాడు.

"ఆశ్చర్యపోతున్నారు కదూ?"

తలూపి తలుపుకు అడ్డం తొలిగి "రండి" అన్నాడు. నిర్మల లోపలికి వచ్చాక కుర్చీ చూపించి, "కూర్చోండి" అన్నాడు. నిర్మల కూర్చోలేదు. చేతులు కట్టుకుని గది కలయ చూస్తోంది. "నా గదిలో కూర్చోకూడదా?" అడిగాడు.

"అసలు మిమ్మల్ని కలవకూడదనుకున్నాను. కలిసినా మాట్లాడకూడదనుకున్నాను."

"నా మీద కోపం వచ్చింది. తప్పు నాదే. నిన్న సాయంత్రం మీ ఇంటికి వస్తానని రాలేకపోయాను. నిన్న ఆఫీసునుండి బయట పడేసరికి ఎనిమిదయింది...."

"నన్నెందుకు ఇలా హింసిస్తారు? వస్తానని రాకపోవటం ఇదేం మొదటిసారా? నేనంటే ఇష్టం లేదని చెప్పొచ్చు కదా?"

"ఎందుకలా మాట్లాడుతారు?"

రుమాలుతో కళ్ళనీళ్ళు తుడుచుకుని "నా జీవితంలో నేను చేసిన పెద్దపొరపాటేమిటంటే మిమ్మల్ని ప్రేమించటం, నా మనసులోంచి మిమ్మల్ని తుడిపేసుకోలేను. నావల్ల కాని పనది" అంది.

"నిన్నింతగా బాధ పెట్టినందుకు నన్ను క్షమించండి" రెండు చేతులు జోడించాడు.

"మనలో మనకు క్షమాపణలు దేనికి?" నవ్వుతూనే అంది కాని కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

అరగంట కూర్చుని వెళ్లిపోతూ, "రేపు మా ఇంటికి మీరు తప్పకుండా రండి. మా అమ్మకు మన సంగతి తెలుసు. మీరు వచ్చారంటే మిమ్మల్ని నాన్నగారికి పరిచయం చేసి మన సంగతి చెబుతాను. అవతల ఆయన నాకు సంబంధాలు చూసే ప్రయత్నంలో ఉన్నారు. మర్చిపోవద్దు. రేపు సాయంత్రం ఆరుగంటలకు "చేయిచాపి ప్రామిస్ చేయించుకుంది.

మరుసటి రోజు సాయంత్రం నిర్మల సత్యం కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అమ్మ దేవాలయానికి వెళ్లింది. నాన్న ఆఫీసునుండి వచ్చే సమయం అయింది. గేటు దగ్గర ఏ చిన్న శబ్దమయినా సత్యమేమో అనిపిస్తోంది. ఈసారి తలుపు తీసిన చప్పుడు వినిపించేసరికి కుర్చీలోంచి లేచి నిలబడింది. సత్యం కాదు. తన స్నేహితురాలు సరోజిని వస్తోంది. ఆ సమయంలో సరోజిని రావటం నిర్మలకు ఇష్టమనిపించలేదు. సరోజినిని కూర్చోమని కూడా అనలేదు. సరోజిని కుర్చీ లాక్కుని నిర్మల ఎదురుగా కూర్చుని, "నీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను" అంది.

చేతి గడియారం చూసుకుంటూ, "ఏమిటో త్వరగా చెప్పు" అంది నిర్మల.

"నీకు సత్యం తెలుసా?"

"తెలుసు."

"అతని గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

ఏమని జవాబు చెప్పాలో నిర్మలకు తోచలేదు.

"ఎలాటివాడు?"

"మంచివాడే."

"సత్యం నన్ను పెళ్ళిచేసుకుందామని అనుకుంటున్నాడు. మా వాళ్ళూ ఒప్పుకున్నారు...." అంది సరోజిని.

తలమీద పిడుగు పడినట్లనిపించింది నిర్మలకు. ఎర్రగా ఇంకిపోతున్న సూర్యుడిని పిచ్చి చూపులతో చూస్తోంటే సరోజిని ఒక్కో సంగతి చెప్పుకుపోతోంది. సత్యం తనను ఎలా ప్రేమిస్తున్నదీ, తను అతనికి ఎలా దగ్గిరయిందీ విడమర్చి చెబుతూ తన దగ్గిరున్న పుస్తకం తీసి అందులో ఉన్న సత్యం ఫోటో, అతను తనకు రాసిన ఉత్తరాలు చూపిస్తోంటే నిర్మల మెదడు మొద్దుబారి పోయింది. సరోజిని వెళ్ళిపోయాక రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడుస్తూ ఉండిపోయింది. నెలతిరగకుండానే నిర్మల పెళ్ళి సోమయాజులతో ఘనంగా జరిగింది.

నాలుగు సంవత్సరాల గడిచాక ఆ మరపురాని సాయంత్రం లాటి మరో సాయంత్రం స్టేషన్‌లో గంట కొట్టారు.గార్డు విజిలు వేసి జండా ఊపుతుండగా బండి కదిలింది. "ఇంటికి చేరుకోగానే ఉత్తరంరాయి" అన్నాడు సోమయాజులు.

"సరే, మీ ఆరోగ్యం జాగ్రత్త" అంది నిర్మల.

భర్త కనిపించేవరకు అతనివైపే చూస్తుండిపోయి తలతిప్పి తన ఎదురుగా కూర్చున్న ఆమెను చూసి పలకరించబోయేంత లోపల, "నేను గుర్తున్నానా?" అడిగిందామె.

"నువ్వు సరోజినివి కదూ?"

"గుర్తు పట్టావు" సరోజిని మునుపటి కన్నా లావెక్కింది. "నువ్వు చాలా మారిపోయావు. బండి ఎక్కిన దగ్గరనుండి నువ్వా, కాదా అనుకుంటూ ఉన్నాను" అంది సరోజిని.

ఇద్దరూ చాలాసేపటి వరకు చాలా కబుర్లు చెప్పుకున్నారు. ఏలూరు

దగ్గిరవుతుండగా తనను వేధిస్తున్న ప్రశ్నను దాచుకోలేక "మీ ఆయన సత్యం ఎలా ఉన్నాడు?" అడిగింది నిర్మల.

"మా ఆయన సత్యం కాదు."

"సత్యాన్ని చేసుకుంటానన్నావు కదా?"

"లేదు. అటువంటి ఉద్దేశమే లేదు. నువ్వు నన్ను క్షమిస్తానంటే ఒక నిజం చెప్తాను."

"చెప్పు."

"నేనా రోజు నీతో చెప్పినదంతా అబద్ధం. సత్యం కోరిక మీద నీ దగ్గిర నాటకం ఆడాను."

తనకేమీ అర్థం కానట్టు చూసింది నిర్మల.

"సత్యం నన్ను చెల్లెలుగా చూసుకునేవాడు. పిలవటం కూడా చెల్లాయి అని పిలిచేవాడు. ఒక సాయంత్రం మా ఇంటికి వచ్చి నీ దగ్గిరకు వెళ్లమని కోరాడు. నాకు మీ గురించి తెలుసు. నిర్మలంటే నాకు ప్రాణం. నిర్మల నన్ను ఎంతగానో ప్రేమిస్తోంది. నన్ను చేసుకుని ఆమె సుఖపడలేదు. ఆమె ఎక్కడో ఒకచోట సుఖంగా ఉండటమే నాకు కావలసింది. నా కోసం నిర్మల ముందు అలా నటించు. ఆమె మనసు నామీంచి తొలగిపోయేలా చూడమని ఏడుస్తూ బతిమిలాడితే అయిష్టంగా వప్పుకున్నాను. అప్పటికప్పుడు నాలుగు ఉత్తరాలు రాసిచ్చి నేను నీ దగ్గర ఎలా నటించాలో చెప్పి నన్ను నీదగ్గరకు పంపించాడు." దుఃఖంతో గొంతు నిండిపోయేసరికి సరోజిని మాట్లాడలేకపోయింది. కళ్లల్లో నీళ్ళు తిరుగుతుంటే చీర కొంగుతో తుడుచుకుంటూ ఉండిపోయింది.

ఏలూరు వచ్చాక సరోజిని లేచి నిర్మల చేయి పట్టుకుని, "నా మూలాన నీకతను దూరమయ్యాడు. అప్పుడు ఆ నాటకానికి వప్పుకోకుండా ఉండాల్సింది. నన్ను క్షమించు." అంది.

"దిగి పోతున్నావా?"

సరోజిని తలూపింది. సత్యం గురించి ఎన్నో అడగాలనిపిస్తోంది. హృదయం బాధతో నిండిపోసాగింది. సరోజిని దిగి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడి, "నేను నీకు చాలా అన్యాయం చేశాను" అంది.

మనసులోని దుఃఖం తన్నుకుంటూ బయటకు వచ్చేట్టుంది. నిగ్రహించుకుంటూ, "సత్యం ఎక్కడ ఉంటున్నాడు?" అడిగింది.

"మంగళగిరిలో."

"అక్కడేం చేస్తున్నాడు?"

సరోజిని జవాబు చెప్పటానికి తటపటాయించింది.

"నీకెప్పుడయినా కనిపించాడా?"

"రెండేళ్ళ కిందట విజయవాడ స్టేషన్లో కనిపించాడు. మనిషి బాగా చిక్కిపోయాడు. చాలాసేపు నీ గురించే మాట్లాడుతూ ఉండిపోయాడు. అతను పాత సత్యమే. నిన్ను మర్చిపోలేదు. మర్చిపోలేడనుకుంటాను."

రైలు కదిలింది.

"మంగళగిరిలో ఏం చేస్తున్నాడు?"

"శానిటోరియంలో ఉన్నాడు."

ఆ క్షణంలో నిర్మలకు కాలం స్థంభించి నట్లనిపించింది. తను నాలుగు సంవత్సరాలు వెనక్కి పరుగెత్తలేదు.

◆ ఆంధ్ర సచిత్ర వారపత్రిక - 18 జూన్ 1965